పి.గన్నవరం మండలం లంకల గన్నవరంలో ఏటిగట్టుపై చిన్నారులతో బాలింత

వరద గోదారి

- నీట మునిగిన లోతట్టు లంక గ్రామాలు
- స్తంభించిన జన జీవనం, నిలిచిన రాకపోకలు
- భద్రాచలం వద్ద 3వ, కాటన్ బ్యారేజీ వద్ద 2వ ప్రమాద హెచ్చరికలు

రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి

ధళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద

గోదావరి ఉగ్రరూపం దాల్చింది. లంకలను చుట్టుముట్టింది. ఇప్పటికే లంక భూముల్లో పంటలను తనలో కలిపేసుకున్న గోదావరి గ్రామాల్లోకి ఉరకలు తీస్తోంది. గోదావరి ఉగ్రరూపానికి లంకలు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. ఇప్పటికే లోతట్టు గ్రామాలు ముంపునకు గురవ్వడంతో తట్టాబుట్టాతో నిర్వాసితులు ఏటిగట్లను ఆశ్రయిస్తున్నారు. కనీస వసతుల్లేక పిల్లాపాపలతో అష్టకష్టాలు పడుతున్నారు.

లంకల గన్నవరంలో ప్రజల పాట్లు

రాజోలులో లంకల నుంచి కొబ్బరికాయలను తరలిస్తున్న రైతులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి నది వరద ఉధృతి కొనసాగుతోంది. వాయుగుండం కారణంగా ఎగువ రాష్ట్రాలతో పాటూ రాష్ట్రంలోనూ విస్తారంగా వర్షాలు కురవడంతో వరద తాకిడి మరింత ఎక్కువైంది. వారం రోజులుగా కొనసాగుతున్న వరద గోదావరి నదీ పరివాహక ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. భద్రాచలం వద్ద తగ్గినట్టే తగ్గిన వరద శుక్రవారం ఉదయం నుంచి మళ్లీ పెరిగింది. గురువారం సాయంత్రానికి 46 అడుగులకు తగ్గింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. శుక్రవారం రాత్రికి 53.10 అడుగులకు ప్రవాహం పెరిగింది. దీంతో ఇక్కడ మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమలోని పరివాహక ప్రాంతాలు, లంకలను వరదనీరు చుట్టుముట్టింది. భద్రాచలం నుంచి వస్తున్న ప్రవాహాన్ని అంచనా వేసుకుని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద బ్యారేజీ వద్ద 13.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో బ్యారేజీకి చెందిన 175 గేట్లను పైకిలేపి 13 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. 24 గంటలుగా ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక అమల్లోనే ఉంది. తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని పాత బ్రిడ్జి వద్ద 14.90 మీటర్ల నీటి మట్టం ఉంది.

నీట మునిగిన లోతట్టు లంక గ్రామాలు

కోనసీమ లంక గ్రామాలను వరద నీరు చుట్టిముట్టింది. లోతట్టు లంక గ్రామాల్లోని ఇళ్లలోకి వరద చేరింది. కాజ్‌వేలు నీటమునిగాయి. సఖినేటిపల్లి మండలంలోని అప్పనారాముని లంక, సఖినేటిపల్లిలంక, కొత్తలంక, టేకిశెట్టిపాలెంలోని కొంతభాగం, మలికిపురం మండలంలోని రామరాజులంక, బాడవ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. టేకిశెట్టిపాలెంలో నివాసాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోవడంతో ఏటిగట్టుపై గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. వరద కారణంగా నరసాపురం- సఖినేటిపల్లి రేవుల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. లంకల్లో కూరగాయలు, తమలపాకు పంటలను వరదనీటిలో మునిగిపోయాయి. మామిడికుదురు మండల పరిధిలో పెదపట్నంలంక, బి. దొడ్డవరం, అప్పనపల్లి, ప్రధాన రహదారి వరద నీటమునడంతో రాకపోకలు నిలిచిపోయి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పెదపట్నం, పాశర్లపూడి పల్లవపాలెంలో నివాసాల చుట్టూ వరద నీరు చుట్టుముట్టింది. అప్పనపల్లి ఇందిరమ్మ కాలనీ నీట మునిగింది. పి.గన్నవరం మండలంలో 10 లంక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. జి.పెదపూడిలంక, ఉడిముడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక వాసులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతలకు ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు చేరుకున్నాయి.

పెరవలి : మండలం ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరంలో పల్లపు లంక ప్రాంతాలు నీట మునిగాయి. అరటి, కంద, కోకో ఇతర పంటలు వరద నీటిలో మునిగిపోయాయి. పంట చేతికందే సమయానికి వరదలతో నష్టాలకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాళ్లపూడి : మండంలోని లంక భూముల్లోకి వరద నీరు చేరింది. గట్టు లోపల ప్రదేశాల్లో గల బెండ, వంగ, కొత్తిమీర వంటి పంటలు నీట మునిగాయి. వర్షాల కారణంగా వరి నాట్లు నేత మొనగాడంతో రైతులు లబోదిబో ఇవ్వమంటున్నారు.

పెరవలి మండలంలో అరటితోటలోకి ప్రవహించిన నీరు

అప్పనపల్లిలంకలో ఇళ్ల వద్దకు చేరిన వరద నీరు

ఆత్రేయపురంలో పంటలను ముంచెత్తిన వరద

లంకల గన్నవరంలో తాగునీటి కష్టాలు

వరద నేపథ్యంలో పటిష్ట చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వరద ప్రమాద హెచ్చరికల దృష్ట్యా అత్యంత పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ముఖ్యమంత్రి జగన్‌కు తెలిపారు. శుక్రవారం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెసి తేజ్ భరత్, డిఆర్‌ఒ నరసింహులు, వివిధ శాఖల అధికారులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వరద నేపథ్యంలో తీసుకున్న చర్యలను కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. అధిక వర్షాలు, వరదలు కారణంగా లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, మంచి నూనె, ఉల్లిపాయలు వంటి నిత్యావసర వస్తువులు ఉచితంగా అందించాలన్నారు. పునరావస కేంద్రాల వద్ద, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ, మెడికల్ క్యాంపుల ద్వారా వైద్య చికిత్స, మందులు అందచేయాలని ఆదేశించారు. వరద ఉదతి తగ్గిన తర్వాత వరద నష్టం పై ఎన్యుమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. కలెక్టర్ మాధవీలత వివరిస్తూ గోదావరినది కాటన్ బ్యారేజ్ వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలను ముందుగా గుర్తించి అక్కడ ప్రజలను అప్రమత్తం చేసామన్నారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా జిల్లా యంత్రాంగం రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, నియోజక వర్గ, మండల స్పెషల్ ఆఫీసర్స్‌ను, అగ్నిమాపక, మత్స్య, పురపాలక, అగ్నిమాపక , పంచాయతీ రాజ్ తదితర శాఖలను అప్రమత్తం చేశామన్నారు. లంక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా, డివిజినల్ , మండల స్థాయిలో స్థాయి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. బలహీనంగా ఉన్న గట్లు వద్ద ఇసుక బస్తాలు, ఇతర రక్షణ చర్యలను చేపట్టామన్నారు. జిల్లాలో రెండు లంక గ్రామాలకు సంబంధించి 12 మంది గర్భిణులను ఆసుపత్రికి తరలించామన్నారు. లంక గ్రామాలకు వలస వచ్చిన 56 మంది మత్స్యకారులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మణిపూర్ దమనకాండపై నిరసన

ప్రజాశక్తి - నిడదవోలు

మణిపూర్ దమనకాండపై స్థానిక సిహెచ్‌సి వద్ద ఆశావర్కర్లు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశాల నాయకులు దయామణి మాట్లాడారు. మణిపూర్‌లో రోజురోజుకీ ఆదివాసీ గిరిజన మహిళలపై హింసాకాండ, హత్యలు, అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. వీటిని అదుపు చేయలేని మణిపూర్ మఖ్యమంత్రి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్ వాషింగ్ వర్క్ షాపులో పని చేసుకొని ఇంటికి వస్తున్న ఇద్దరు గిరిజన మహిళలను వేలాది మంది చూస్తుండగా వివస్త్రలను చేసి ఊరేగిస్తూ వికృత చేష్టలకు పాల్పడ్డారన్నారు. భేటీ బచావో అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జువ్వల రాంబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్నారి, హేమలత, జ్యోతి, దుర్గాదేవి, రాణి, విజయ లక్ష్మి, విజయ, సత్యవతి, మధుబాల, రూతు, మంగ రాజు, మణి, టి.నాని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని విడదీయొద్దని వినతి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

తరతరాలుగా కలసి ఉన్న దొమ్మే రు, దొమ్మేరు సావరం ఒకే గ్రామంగా కలసి ఒకే పంచాయతీగా ఉంటున్నాయని, వీటిని విడదీయరాదని దొమ్మేరు ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు కోరారు. ఉప సర్పంచ్ సుబ్బారావు ఆధ్వర్యంలో టిడిపి, వైసిపి ఎంపిటిసి సభ్యులు, గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌కి వినతిపత్రాలు అందజేశారు.

కాల్దరిలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కాల్దరిలో నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సిసి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమది ప్రజా ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టోపై టిడిపి ప్రచారం

ఉండ్రాజవరం : టిడిపి మినీ మేనిఫెస్టోపై ఉండ్రాచవరంలో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. టిడిపి నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, టిడిపి నాయకులు పి.ప్రసాదరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రతపై అవగాహన సదస్సు

చాగల్లు : ఎస్ఎస్‌జి-2023కు సంబంధించి చిక్కాల పంచాయతీ వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ నల్లూరి అప్పారావు గ్రామ పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇ అజయ్‌బాబు, ఇఒపిఆర్‌డి ఆర్.శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కె.ఖాసీమ్, సర్పంచ్ కొయ్య మణి, అంగన్‌వాడీలు, హెచ్ఎంలు, ఆశాలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

ప్రజాశక్తి- గోకవరం

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో వైసిపి పాలన సాగుతుందని ఎంఎల్‌ఎ జ్యోతల చంటిబాబు అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ పాల్గొని మాట్లాడారు. పార్టీల ప్రమేయం లేకుండా మండలంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలందేలా చూడాన్నారు. వెదురుపాక వైసిపి నాయకులు నాగ విష్ణు మాట్లాడుతూ జగనన్న కాలనీలకు మౌలిక వసతులు లేక నిర్మాణాల్లో జాప్యం జరుగుతుందన్నారు. గాదేలపాలెం సర్పంచ్ అచ్చిబాబు మాట్లాడుతూ గాదేలాపాలెం-రాజమండ్రి వెళ్లే సర్వీసును నిలిపేసి గాదేలపాలెం-కాకినాడకు సర్వీసును తిప్పుతున్నారన్నారు. రాజమండ్రి ఆర్‌టిసి సర్వీసును యథావిధిగా నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించేందు కషి చేయాలని ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ సమావేశపు హాల్లో సర్వసభ్య సమావేశం ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపిటిసిలు, సర్పంచులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జగనన్న లే-అవుట్లలో విద్యుత్ సర్వీసును ఏర్పాటు చేయాలని, పలుచోట్ల నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. గంగోలు పంచాయతీలో డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ తలారి మాట్లాడారు. ఇళ్ల స్థలాలకు లేని వారికి స్థలాలు ఇచ్చేందుకు భూములను కొనుగోలు చేస్తామని తెలిపారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎడిఇ రవిశంకర్‌ను ఆదేశించారు. కొవ్వూరుపాడులో పిహెచ్‌సి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. సభ్యులు తెలిపిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్ర సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర ట్రేడ్ యూనియన్ల సంయుక్త పిలుపులోభాగంగా విజయవాడ పిబి.సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగే కర్షక, కార్మిక రాష్ట్రసదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు కార్యాలయం వద్ద రాష్ట్ర సదస్సును రైతు సంఘాల నాయకులు ఆవిష్కరించారు. నాయకులు ఉండవల్లి కృష్ణారావు, గారపాటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రైతు రంగానికి హాని కలిగించే మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. విద్యుత్ సంస్కరణ బిల్లు-2020ను రద్దు చేయాలని, పంటలన్నింటికీ డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని, పంట రుణాలను మాఫీ చేయలన్నారు. ఈ కార్యక్రమంలో కంకటాల బుద్ధుడు, ఆచంట సుభాష్‌చంద్రబోస్, పిన్నమనేని సత్యనారాయణ,సిపిఎం సినియర్ నాయకులు కె.దుర్గారావు, నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు నివారణ టీకాలు

కడియం : మండలంలోని పొట్టిలంకలో శుక్రవారం పాడి పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడియం వెటర్నరీ ఎడి డాక్టర్ మక్కిన వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. వరద ప్రభావిత గ్రామాల్లో ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. కావున పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి, సాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ పాల్గొన్నారు.

రూ.20.99 లక్షలకు దేవస్థానం భూముల కౌలు వేలం

కడియం : కడియంలోని శ్రీభ్రమరాంబికా మల్లేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన భూమి కౌలు వేలం రికార్డు స్థాయిలో రూ.20.99 లక్షలకు ఖరారైంది. ఆలయ కార్యనిర్వహణాధికారి వివి.శ్రీనివాసరావు మరియు అధికారుల సమక్షంలో శుక్రవారం ఈ వేలం జరిగిది. కడియపులంక శివారు సర్వే నెంబరు 353/1 లో 4.82 ఎకరాల భూమిని ఏడాదికి రూ.11లక్షలకు కుప్పాల శ్రీకాంత్ దక్కించుకున్నారు. ఇప్పటివరకు ఈ భూమిని ఇదే కుటుంబానికి చెందిన కుప్పాల సత్యవతి ఏడాదికి రూ.1.75 లక్షలు చెల్లించి అనుభవించారు. 353/1లో గల మరో 4.33 ఎకరాల భూమిని పంతం వెంకట రమణ ఏడాదికి రూ.9.99లక్షలకు దక్కించకున్నారు. ఇప్పటివరకు ఈ భూమిని ఇదే కుటుంబానికి చెందిన పంతం సత్యవతి ఏడాదికి రూ.1.17లక్షలు చెల్లించేవారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

కడియం : మణిపూర్‌లో క్రైస్తవ, గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని నిరసిస్తూ జమాతే ఇస్లామి హింద్ కడియం శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు నిరసన తెలిపింది. ఈ సంధర్బంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశంలో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. దేశాన్ని తలదించుకునేలా చేసిందన్నారు. మూడునెలలుగా ఈ అమానుషాన్ని దాచిపెట్టిన ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేసి, శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. జిల్లా నూర్ భాషా సంఘం అధ్యక్షులు ఎ.కౌసర్, పాస్టర్లు, కో-అప్షన్ సభ్యులు సర్కార్‌భాషా, ముంగమూరి చినబాబు, అబ్దుల్లా పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి

రాజానగరం : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ విసి కె.పద్మరాజు ఆకాంక్షించారు. శుక్రవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సి.ఎస్.ఇ. ఫైనల్ ఇయర్ విద్యార్థుల ఫేర్‌వెల్ జరిగింది. దీనికి విసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని అన్ని విభాగాలను బలపరిచేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు.

కార్టూన్ 'నిజం'



ఘనంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి -గోకవరం

గోకవరం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ప్రకతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో 5వేలు మునగ మొక్కలు పెంచారన్నారు. డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికి రెండు మొక్కలు చొప్పున పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగా, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, మండల సచివాలయం కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, వైస్ ఎంపిపి మడికి మైనర్‌బాబు పాల్గొన్నారు.

గోపాలపురం : పర్యావరణ పరిరక్షణకు అవసరమయ్యే మొక్కలను పెంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాముల కావాలని ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సందర్భంగా గోపాలపురంలోని కుమ్మరికుంట చెరువు వద్ద ఎంఎల్‌ఎ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, ఇళ్ల భాస్కరరావు, సర్పంచ్ శేఖర్‌బాబు పాల్గొన్నారు.

అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం : ఐటిఐ పాసైన అభ్యర్థులు ఎపిఎస్‌ఆర్‌టిసిలో అప్రెంటీస్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆర్‌టిసి జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. www.apprenticeshipindia.gov.in వెబ్ సైట్‌లో ఆగస్టు 1 నుంఇచ 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, కాకినాడ జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, కోనసీమ జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్, పెయింటర్ అప్రెంటిసి కోసం దరఖాస్తుచేసుకోవాలన్నారు. వివరాలకు 08922-294906 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు.

న్యాయవాది విఠల్‌బాబు హత్య దారుణం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

న్యాయవాది విఠల్‌బాబు హత్య దారుణమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ళ సుబ్బారావు తీవ్రంగా ఖండించారు. బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది రాయసం ఆదిశేషు విఠల్‌బాబు కిడ్నాప్, అనంతరం హత్య దారుణమన్నారు. న్యావాది మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు, హత్యలు పెరిగాయన్నారు. న్యాయవాదుల రక్షణలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం అమలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విఠల్‌బాబును హత్యచేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

నేరాలు ఘోరాలు

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక బాలిక అదృశ్యమైన సంఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఒక గ్రామానికి చెందిన బాలిక గురువారం ఇంటి నుండి బయటకు వెళ్ళింది. సాయంత్రం అయినప్పటికీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

ఇంట్లో ఆభరణాలు, నగదు చోరీ

ప్రజాశక్తి-గోపాలపురం

ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఆభరణాలు, నగదు దోచుకు వెళ్లిన సంఘటన మండలంలోని వెదుళ్ళకుంటలో శుక్రవారం చోటు చేసుకుంది. డిఎస్‌పి వివిఎన్ వర్మ, క్లూస్ టీమ్స్ ఇంటిని పరిశీలించి వివరాలను సేకరించారు. వెదుళ్ళకుంట గ్రామానికి చెందిన జొన్నలగడ్డ నాగ కుమారి ఈ నెల 16న హైదరాబాద్ వెళ్లారు. తిరిగి శుక్రవారం వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టినట్టు గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం డిఎస్‌పి వివిఎస్ వర్మ, క్లూస్ టీమ్స్, పోలీస్ సిబ్బంది బాధితుల వివరాలు సేకరించారు. సిఐ అనసూరి శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టారు.

చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పెదగాడవిల్లి లోని ఒక ఇంట్లో జరిగిన చోరీపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం పెదగాడవిల్లికి చెందిన నూకల సోమరాజు ఈ నెల 14న ఇంటికి తాళం వేసుకుని బెంగళూరు కుమార్తె ఇంటికి వెళ్లారు.తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించారు. గదిలోని బీరువా తెరిచి చూడగా తొమ్మిది కాసుల బంగారం, కెజి వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు గుర్తించారు.

లారీనీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

సీతానగరం శివారున గుర్తు తెలియని వ్యక్తి లారీని ఢీ కొని అక్కడికక్కడే మతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. జగ్గంపేట ఎఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం పెద్దాపురం నుంచి జగ్గంపేట వస్తున్న లారీని బైకుపై వస్తున్న వ్యక్తి ఢీకొని అక్కడికక్కడే మతి చెందినట్లు తెలిపారు. మతుని వయసు సుమారు 55 ఉంటుందని ఆయన తెలిపారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత

ప్రజాశక్తి-రంగంపేట (గండేపల్లి)

రంగంపేట మండలంలోని కోటపాడు గ్రామంలో ఈ నెల 22న రాత్రి అల్యూమినియం ఫ్యాక్టరీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. అతడికి మతి స్థిమితం లేదని గుర్తించారు. ఎస్ఐ టి.రామకృష్ణ అతడికి వైద్యం చేయించి వివరాలు సేకరించారు. అతని ఫేస్‌బుక్ ఆధారంగా అతనిని నేపాల్ వాసి విజయ్ వాజ్‌పేయిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు శుక్రవారం వచ్చారు. వారికి అతడిని పోలీసులు అప్పగించారు.

అదుపు తప్పి లారీ బోల్తా

ప్రజాశక్తి-గోపాలపురం

టీ తాగేందుకు నిలుపుదల చేసిన గ్రానైట్ లోడు లారీ వెనక్కు వెళ్లి అదుపుతప్పి లంకలో బోల్తా పడిన సంఘటన గోపాలపురం టొబాకో బోర్డు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. టొబాకో బోర్డు వద్ద జాతీయ రహదారిపై లారీ నిలుపుదల చేసి టీ తాగేందుకు డ్రైవర్ వెళ్ళాడు. రోడ్డు పల్లంగా ఉండడంతో లారీ వెనుకకు సుమారు 150 మీటర్లు వెళ్లి అదుపుతప్పి రోడ్డు లంకలో బోల్తా పడింది. ఈ సంఘటనలో రోడ్డుపై ఎటువంటి వాహనాలు రాకపోవడంతో, లారీలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం చోటు చేసుకోలేదని స్థానికులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

మండల కేంద్రం ఉంద్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం ఉదయం నుంచి మతి స్థిమితం లేకుండా, మద్యం సేవించి, ఉంద్రాజవరం వీధుల్లో తిరిగినట్లు స్థానికులు తెలిపారు. అతడు ధరించిన చొక్కాపై నిడదవోలు ఆర్‌కె టైలర్ లేబుల్, మెడలో జంధ్యం ఉందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు సమాచారం తెలియచేయాలని ఉంద్రాజవరం పోలీసులు తెలిపారు.

ముంపునకు గురైన కొమరగిరి ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

పేదలకు ఇళ్ల స్థలాలు అని చెప్పి కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రూ.కోట్లు దోచుకుని కాకినాడ నగర ప్రజలను నట్టేట ముంచారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) విమర్శించారు. యు కొత్తపల్లి మండలం కొమరగిరి ప్రాంతంలో ముంపునకు గురైన కాకినాడ నగర ప్రజలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను శుక్రవారం కొండబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ ద్వారంపూడి తన స్వార్థ ప్రయోజనాల కోసం 18 కిలోమీటర్ల దూరంలోని కొమరగిరిలో ఇళ్ల స్థలాలను ఇచ్చి లబ్ధిదారులను నట్టేట ముంచారన్నారు. చిన్నపాటి వర్షానికే కొమరగిరి కాలనీ ముంపునకు గురవుతోందన్నారు. నాసిరకం నిర్మాణాలు చేపడుతున్నారని, మరో పక్క సముద్రపు కెరటాలు ఎగసిపడి రహదారులు సైతం కోతకు గురవుతున్న విషయం తెలిసి కూడా ద్వారంపూడి తన స్వలాభం కోసం కొమరగిరిలో భూములు తీసుకుని మెరక పనుల పేరుతో పెద్దాపురంలోని ప్రభుత్వ కొండలను తవ్వి ఫిల్లింగ్ చేసి రూ.కోట్లు దోచుకున్నారన్నారు. సుమారు 350 ఎకరాల్లో 16 వేల మందికి స్థలాలు ఇస్తే నేడు కొమరగిరి ప్రాంతంలో 100 లబ్ధిదారులు కూడా ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, మాజీ కార్పొరేటర్లు తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ పాల్గొన్నారు.

నీట మునిగిన కొమరగిరి లేఔట్లు

మధుమేహంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గాంధీనగర్ వంటిమామిడి జంక్షన్ వద్ద గల అశ్విని హాస్పిటల్లో అలయన్స్ క్లబ్ అధ్యక్షులు కిరణ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం మధుమేహ వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పిఆర్‌ఒ మాటూరి శిరీష, వైస్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 60 మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ మధుమేహం వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మధుమేహ వ్యాధి వచ్చిన వారు భయపడాల్సిన అవసరం లేదని క్రమం తప్పకుండా ప్రతినెల మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని మందులను వాడాలన్నారు. మాటూరు శిరీష మాట్లాడుతూ మధుమేహ వ్యాధి ఉన్నవారు క్రమం తప్పక వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పెంకే గోవిందరాజు, కోశాధికారి కొత్త శ్రీరాములు, మణికంఠ, వనుం ఉపేంద్రనాథ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

31న లై డిటెక్టర్ చర్చకు సిద్ధం : దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

తాను ముందుగా చెప్పినట్టు ఈ నెల 31న 'లై డిటెక్టర్ టెస్ట్'కు తాను సిద్ధంగా ఉన్నానని ఆ పరీక్షలో తన నిజాయితీ రుజువు కాకుంటే రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ పదవికి, వైసిపి పెద్దాపురం ఇన్‌ఛార్జి పదవికి రాజీనామా చేసి సామాన్య సభ్యునిగా పార్టీలో కొనసాగుతానని చెప్పారు. ఒకవేళ ఎంఎల్‌ఎ చినరాజప్ప నిజాయితీ రుజువు కాకుంటే ఏమి చేస్తారని ప్రశ్నించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో దొరబాబు మీడియాతో మాట్లాడారు. అవినీతి నిరూపణపై 'లై డిటెక్టర్ టెస్ట్'కు తాను విసిరిన సవాల్‌ను చినరాజప్ప స్వీకరించడం ఆనందదాయకమన్నారు. 100 రూపాయల స్టాంప్ పేపర్లపై ఈ పరీక్షకు అంగీకరిస్తున్నట్టు ఇరుపక్షాలు సంతకాలు చేసి అందించాలని చెప్పారు. స్టాంపు పేపర్లను తానే సిద్ధం చేశానని, అవి ఎక్కడ అందించమంటే అక్కడకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని దొరబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్‌లు ఊబా జాన్ మోజెస్, నెక్కంటి సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

స్టాంప్ పేపర్లు చూపుతున్న దొరబాబు

కరపలో మొబైల్ అన్న క్యాంటీన్

ప్రజాశక్తి -కరప

కరప బజార్ సెంటర్లో అన్న క్యాంటీన్ నిర్వహించినట్లు టిడిపి మండల అధ్యక్షుడు దేవువెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం దేవు వెంకన్న ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ సమ ర్పించిన వాటిని మినీ వ్యాన్‌పై ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ కరప గ్రామంలో 10 రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. టిడిపి పరిపాలన కాలంలో ప్రజలు ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లను వైసిపి ప్రభుత్వం వచ్చాక తొలగించడం చాలా విచారకరమైన సంఘటన అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, జగ్గారావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలపై రోగులకు అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

కెసిబిఎస్ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా సంస్థ సభ్యులకు శుక్రవారం కిడ్నీ సమస్యలు- తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సంస్థ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, డైరెక్టర్లు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ పల్లపోటు రవీంద్ర, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సా నిపుణులు, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ సీమకుర్తి సూర్య నిహార్ వైద్య శిబిరంలో అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. వైద్య సేవలు అందించారు. తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కె.సత్యనారాయణమూర్తి, రెడ్డి వీర రాజేంద్ర కుమార్, ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, మేనేజర్ చీమల కొండ గంగాధరం పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న కొండబాబు

'టిడిపితోనే మహిళల అభ్యున్నతి'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మహిళల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, వైసిపి పాలనలో మహిళలపై దాడులు పెరిగిపయాయని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. టిడిపి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా 8వ డివిజన్ కొత్త కాకినాడలో ఆయన పర్యటించారు. మహాశక్తి మేనిఫెస్టోపై మహిళలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహనీయుడు ఎన్‌టిఆర్ అని, చంద్రబాబు ప్రభుత్వ హయాంలో డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి మహిళల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారని చెప్పారు. మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇచ్చి చట్ట సభల్లో గౌరవంగా నిలబెట్టిన నాయకుడు చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, సీకోటి అప్పలకొండ, మమతా శ్రీనివాస్, దాసరి సత్యవతి, ఇల్లా గోవిందమ్మా, సుబ్బమ్మ, మోసా దుర్గమ్మ, చోడిపిల్లి అమ్మోరమ్మ, మైలిపిల్లి మసేనమ్మ, సూరడా నూకాలమ్మ, బడే సత్యారావు, చొక్కా బాబూరావు, మైలపిల్లి తాతారావు, కోడా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి అన్నవరం

పర్యావరణం పరిరక్షణకు మొక్కలు పెంపకమే శరణ్యమని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నవరం బైపాస్‌లో ఉన్న సత్యదేవుని సొంత క్షేత్రంలో మారేడు, తులసి, జమ్మి, సంపంగి ఔషధ మొక్కలను కమిషనర్ తన సతీమణి స్వర్ణ శ్రీతో కలిసి నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మానవుడు తన జీవన మనుగడ కోసం పర్యావరణాన్ని కాపాడే పచ్చదనాన్ని ఇచ్చే వృక్షాలను నిర్వీర్యం చేస్తున్నాడన్నారు. తద్వారా మానవాళి, మానవాళికి పయోగపడే సహజ వనరులు క్షీణించి కాలానికి అను గుణంగా వాతావరణం మార్పులు కలవడం లేదని చెప్పారు. వీరికి దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్, చైర్మన్ ఐవి రోహిత్ స్వాగతం పలికారు.

సహకార సంఘాల అధ్యక్షులు మార్పు

ప్రజాశక్తి-కాజులూరు

మండలంలోని రెండు సహకార సంఘాల అధ్యక్షులు మార్పు చేశారు. మండలంలోని జగన్నాథగిరి కోలంక గ్రామాల్లో ఇద్దరు అధ్యక్షులను మార్పు చేశారు. నూతనంగా కోలంక సహకార సంఘ అధ్యక్షులుగా తోగరు చంద్రశేఖర్, జగన్నాథగిరి సహకార సంఘ అధ్యక్షులుగా కాకర్లపూడి వీరభద్ర రాజును నియమించినట్లు తెలియ వచ్చింది. వీరు కొద్దిరోజుల్లో అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

లోవ దేవస్థానంలో పనుల పరిశీలన

ప్రజాశక్తి-కోటనందూరు

తుని తలుపులమ్మ తల్లి దేవస్థానంలో అభివృద్ధి పనులను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులను, వన్ వే రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి వచ్చే యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించాలని లక్ష్యంతోనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్టు చెప్పారు. సిబ్బంది సమన్వయంతో పని చేసి యాత్రికులకు అసౌకర్యం లేకుండా చూడాలని సూచించారు. అనంతరం తలుపులమ్మ తల్లి ఆలయ సహాయక కమిషనర్ పెనుముచ్చు విశ్వనాథ రాజు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తోట దుర్గేష్ కుమార్, డిఇ ఉదయ్ కుమార్, శ్రీనివాస్ ఆచార్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

రాజీవ్ పార్క్‌లోకి ప్రవేశించిన వరద నీరు

యానాంలో పెరుగుతున్న గోదావరి వరద

ప్రజాశక్తి - యానాం

యానాం వద్ద గోదావరి వరదనీరు అంతకంతకు పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వరదనీటిని దిగువకు వదులుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద రెండవ ప్రమాదక హెచ్చరిక కొనసాగుతుంది. దీంతో వరదనీరు గౌతమీ గోదావరి గుండా యానాం మీదుగా ప్రవహించి సముద్రంలో కలుస్తోంది. యానాం-ఎదుర్లంక వారధి వద్ద వరద ఉధతి కొనసాగుతుంది. యానాం పుష్కర్ ఘాట్, రాజీవ్ పార్క్ నీట మునిగాయి. ఓల్డ్ రాజీవ్ నగర్, గురుకృష్ణాపురంలోకి వరద నీరు రాకుండా మోటార్ల సహాయంతో నీటిని తోడుతున్నారు. ఇసుక బస్తాలను సిద్ధం చేసి అడ్డుకట్ట వేస్తున్నారు. ఈ సందర్భంగా యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం పలు ప్రాంతాలను పరిశీలించారు.

క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న మల్లాడి కృష్ణారావు

నవోదయలో ముగిసిన క్లస్టర్ క్రీడా పోటీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయలో గత రెండు రోజులుగా తొమ్మిది జిల్లాల విద్యార్థులతో ఏపీ-1 క్లస్టర్ క్రీడా పోటీలు,వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహించారు. శుక్రవారం ముగింపు వేడుకలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు, ఎస్‌పి రఘునాయగం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ నవోదయ విద్యాలయలో చదివితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. యానాంలో నవోదయ విద్యాలయ స్థాపించడానికి జిఎంసి బాలయోగి ముఖ్య కారకులని గుర్తు చేశారు. ప్రిన్సిపల్ టివిఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ యానాం నవోదయ పుదుచ్చేరి స్థాయిలో ఫలితాల్లో ప్రథమ స్థానంలో ఉందని, విద్యార్థులు, అధ్యాపకుల కషితోనే ఇది సాధ్యమైందన్నారు. కష్ణా, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి తదితర జిల్లాల నుంచి 160 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన ఆయా జిల్లాల క్రీడాకారులకు మెమెంటో, ప్రశంస పత్రాలు అందించారు. లెక్చరర్లు సుధాకర్, శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 27న ఎల్‌డిసి రాత పరీక్ష

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా లోయర్ డివిజన్ క్లర్క్, స్టోర్ కీపర్ గ్రూప్ 3 పోస్టుల భర్తీకి సంబంధించి ఆగస్టు 27న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు అండర్ సెక్రటరీ వి.జయశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు డౌన్లోడ్, ఎగ్జామ్ సెంటర్లు తదితర వివరాలను త్వరలో తెలియజేయునున్నట్లు తెలిపారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

ప్రజాశక్తి-కోటనందూరు

పరిపాలన అనుభవం లేకపోవడం వల్ల సిఎం వైఎస్.జగన్ పరిపాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు అన్నారు. శుక్రవారం తుని రూరల్ సీతయ్యపేటలో టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను గడపగడపకూ ప్రసారం చేస్తూ , ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన మహాశక్తి పథకం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరు తుందన్నారు. పరిపాలన దక్షత కలిగిన చంద్రబాబును మళ్ళీ ముఖ్యమంత్రి చేస్తే రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరు తుందని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పొలనాటి శేషగిరి మోతుకూరి వెంకటేష్, అప్పన రమేష్, వంగలపూడి బుజ్జి అరిగెల నరసింహారెడ్డి, గాది వరహాల బాబు, కొండు నాగేశ్వరరావు, దంతులూరు శ్రీనివాసరాజు, గొల్ల రమణమ్మ, బుట్ట సత్యవతి, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి -కరప

మండలంలో బడి బయట ఉండే పిల్లలను బడిలో చేర్పించే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ కె.అప్పారావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.అప్పారావు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు కె.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్, సిఆర్పిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఇఒకె కృష్ణవేణి మాట్లాడుతూ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, సిఆర్‌పిలతో బడిబయట ఉండే పిల్లలు 219 మందిని వాలంటీర్ల సాయంతో గుర్తించి వాళ్లను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

అసంపూర్తిగా తాపేశ్వరం -ద్వారపూడి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు పనులు ఎప్పటికి పూర్తి చేస్తారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై మూడేళ్లు అయిందన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టి ఏడాది పూర్తయిందన్నారు. రోడ్డు నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు వందలాది మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారన్నారు. త్వరితగతిన రోడ్డు పూర్తి చేసి ముగింపు పలకక పోతే ప్రజలతో కలిసి టిడిపి తరపున ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఎంఎల్‌ఎ వేగుళ్ల ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి టౌన్ ప్రెసిడెంట్ వుంగరాల రాంబాబు, వాకచర్ల గుప్తా పాల్గొన్నారు.

వైసిపి బిసి సెల్ మండల అధ్యక్షునిగా పళ్లంరాజు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి బిసి సెల్ విభాగం మండల అధ్యక్షునిగా ఉప్పలగుప్తంకు చెందిన యనమదల పళ్లంరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఆయన కుమారుడు డాక్టర్ శ్రీకాంత్‌లను పళ్ళంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పళ్లంరాజును మంత్రి విశ్వరూప్, శ్రీకాంత్‌లు అభినందించి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.ఆయన వెంట వైసిపి నాయకులు మోటూరి సత్యం కాపు తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

ప్రజాశక్తి-అంబాజీపేట

మాచవరం పోలింగ్ బూత్ 118 ఏరియాల్లో ఓటర్ వెరిఫికేషన్ శుక్రవారం టిడిపి క్లస్టర్ ఇంఛార్జి గణపతి వీరరాఘవులు ఆధ్వర్యంలో బొంతు పెదబాబు, గుడాల ఫణి తదితరులు పాల్గొన్నారు. వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఓటర్ వెరిఫికేషన్ చేయా లని కోరారు. కె.పెదపూడి బూత్ 140లో మండల ప్రధాన కార్యదర్శి గుడాల ఫణి, ఇ.హనుమంతరావు పెదపూడి శ్రీనివాసరావులు పాల్గొని ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉన్నది లేనిది పరిశీలించుకోవాలన్నారు.

అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈ సంవత్సరం నుంచే ప్రారంభమవుతుందని మంత్రి విశ్వరూప్ అన్నారు. ప్రస్తుతం కాలేజ్ రోడ్డు లో ఉన్న బీకన్న హోటల్ ఎదురుగాఉన్న భవనంలో తాత్కాలికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయటకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఉత్తర్వులను మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రొసీడింగ్స్‌ను డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.నరసింహస్వామి మంత్రి చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. నియోజకవర్గంలో ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థులదరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అన్నారు. కార్యక్రమంలో లెక్చరర్స్ ఎమ్.బాలా స్వామి, మురళి కృష్ణ, నాయకులు చెల్లుబోయిన శ్రీను, సంసాని బుల్లినాని, నాగారపు వెంకటేశ్వ రరావు, బొంతు గోవింద్‌శెట్టి, పొలమురి బాలకృష్ణ, మాజీ విద్యార్థి సంఘ నాయకులు గంటి చిరంజీవి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అనుమతులను ప్రదర్శిస్తున్న మంత్రి విశ్వరూప్



గడప..గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వేణు

'యనమదల' రోడ్డు నిర్మించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి- రామచంద్రపురం

మండలం లోని యనమదల గ్రామంలో రోడ్డును ఆధునికీకరించాలని గడప..గడపకూ మన ప్రభుత్వంకార్యక్రమంలో పాల్గొన్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు గ్రామస్తులు విన్నవించారు. పెద్దపెద్ద గోతులు ఏర్పడిన యనమదల-రామచంద్రపురం రహదారిలో వర్షాకాలం పరిస్థితి మరింత దారుణంగా ఉందని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ లక్ష్యంగా అమలుచేస్తున్న పథకాలను మంత్రి వివరిస్తూ రోడ్ల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ప్రజలు తెలిపిన పలు సమస్యలపరిష్కారానికి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవాని, గ్రామ సర్పంచ్ పివివి.రమణ, పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

M.V.O.P.No. 45/2022

Between:

రాశంశెట్టి కృష్ణ ...పిటీషనరు

అండ్

ఎస్.రాంబాబు వగైరాలు ...రెస్పాండెంట్లు

R-2: మిరపాల దుర్గ, భర్త: సూర్యప్రకాశ్, 36 సంIIలు, డో.నెం. 57-2-2, యేసువారి వీధి, జగన్నాథపురం, కాకినాడ-2.

పై నెంబరు పిటీషనును పిటీషనరు మీ నుండి నష్ట పరిహారము ఇప్పించుమని కోరుచూ పిటీషను దాఖలు చేసి మీకు కోర్టు ద్వారా ఎన్ని మార్లు సమన్లు పంపిననూ త్రిప్పి వేయుచున్నందున ఇందుమూలముగా మీకు తెలియచేయునది ఏమనగా పై నెంబరు పిటీషను **ది. 24-08-2023వ తేదీకి వాయిదా మీ హాజరుకై ఉన్నది. కావున పై తేదీనాడు కోర్టు వారి ఎదుట ఉదయం గంII10:30 నిIIలకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని అభ్యంతరముల ఉన్న తెలుపుకొనగలరు.** లేని ఎడల సదరు పిటీషను మీ పరోక్షములో నిర్ణయించ బడునని గ్రహించగలరు.

K.V.V.CHALAPATHI
UDDANDA UMA GOWRI
కాకినాడ Advocates, Kakinada
22-7-2023 Cell: 9848260426

ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, సామర్లకోట, చిన్నవీధికి చెందిన జ్యోతుల లక్ష్మి, భర్త: రాజుబాబు, తండ్రి: దేగల రామారావుకు చెందిన మండలంలోని **కాపవరం గ్రామంలో సర్వే నెం. 189/2లో గల భూమి య.0-50 సెంట్లు** భూమికి చెందిన ఒరిజినల్ దస్తావేజు ది.21-07-2023 నాడు సామర్లకోటలో జిరాక్సు తీయించుకొనుటకు వెడుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరకిన ఎడల క్రింది చిరునామాకు అందచేయమని కోరుతున్నాను.

జ్యోతుల లక్ష్మి
భర్త: రాజుబాబు, డో.నెం. 12-6-101, చిన్న వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.
సెల్: 99122 89849

In the Court of the Principal District Judge, Eluru

M.V.O.P. No. 585/2022

Between:

Nimiditalli Ratna Kumar ***...Petitioner***

AND

Pattapagala Srinivas and Others ***...Respondents***

To:

R-1: Pattapagala Srinivas, S/o. Chandra Rao, Driver of Lorry AP 37 TD 2759, Yadava Street, Nidadavolu V & M, East Godavari District.

పై నెంబరు నందు 1st Respondent వార్కి ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిన మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. **ది. 02-8-2023న ఉదయం 10.30 నిIIలకు** పై కోర్టు వారి ఎదుట మీరు గాని, మీ ప్లీడరు గారు గాని హాజరు కావలెను. లేని ఎడల పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా: 02-8-2023

ELURU VENKATESWARA RAO
ELURU SESHA MAHESH BABU
Advocates, Eluru
Cell: 9440188677